జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
27 గురువారం, ఆగస్టు 2026 పేజీలు:09



## కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ నేతల చేరికలు

**మహబూబ్‌నగర్ ఆగస్టు 26( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం గూడూరు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వివరాలు 2లో

# నెట్టెంపాడు మిగిలిన పనులు పూర్తి చేస్తాం

-99,100,101 ప్యాకేజీలను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే సంపత్‌కుమార్ -ఎర్రవల్లి చౌరస్తాలో ఎంపీ మల్లు రవి,సంపత్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

2 లో





## జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

- మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్న ముస్లింలు-ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శోభాయాత్రలు

**నాగర్ కర్నూల్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా బుధవారం మీలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరుపుకున్నారు.

వివరాలు 2లో

# కంచుపాడులో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభ




- సుధాకర్ రెడ్డి ఆశయాలను కొనసాగించాలి: ఎంపీ మల్లు రవి,డా.సంపత్ కుమార్-కంచుపాడులో క్రీడా ప్రాంగణం,లైబ్రరీ,వసతి గృహాల ప్రారంభం- గ్రామ అభివృద్ధికి రూ.3 కోట్ల బిటీ రోడ్డు రూ.కోటితో అత్యాధునిక పాఠశాల

2 లో

# మహమ్మద్ ప్రవక్త కారణజన్ముడు

## -విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 26 (ప్రజా జ్యోతి)**



మహమ్మద్ ప్రవక్త కారణజన్ముడని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్. శ్రీధర్ అన్నారు. మీలాదున్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక వ్యక్తి పేరు మనసులో తలచిన లేదా పలికిన వెంటనే అల్లాహ్ కరుణ అతడి ఆత్మ పై వర్షించాలని విశ్వాసులందరు ప్రార్థిస్తున్నారంటే ఆ వ్యక్తి యొక్క మహోన్నతిని చాటుతుందని అన్నారు.కారణజన్ముడైన మహమ్మద్ ప్రవక్త అల్లాహ్ పంపిన ప్రవక్తలలో చివరి ప్రవక్తగా పవిత్ర ఖురాన్ గ్రంథం పేర్కొన్నదని,అటువంటి నిరాడంబరుడు,తేజస్వి మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీ పండుగగా రచేసుకుంటున్న ముస్లిం సోదరులకు “మిలాద్ ఉన్ నబీ“ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు.

# జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట జామే మస్జిద్ , కొల్లాపూర్ కల్వకుర్తి, నాగర్ కర్నూల్ కేంద్రంలోని జామా మస్జిద్ లలో మీలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జామియా నిజాం మియా అరబి యూనివర్సిటీ కి చెందిన మౌలానా ముఫ్తీలు మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆయన అనుసరించిన విధానాలను కండ్లకు కట్టినట్లు వివరించారు. మహమ్మద్ ప్రవక్త ఈ మానవాళికి భూమికి ఆకాశానికి ఒక క్రాంతి లాంటి వారని ఆయన చూపిన మార్గమే సన్మార్గం ఆ మార్గం లో కొనసాగాలన్నారు . భూమి ఆకాశం ఈ సృష్టికే సృష్టికర్త అయిన అల్లాహ్ ముందుగా మహమ్మద్ ప్రవక్త పుట్టకముందే ఒక సందేశాన్ని ఇచ్చే విధంగా ఏడు లోకాల నుంచి భూమి వరకు ఒక క్రాంతిని సృష్టించారన్నారు. ఈ భూమి మీద చెట్టు పుట్ట నీరు జీవజాలం సర్వస్వం ప్రవక్త కోసమే అల్లా సృష్టించారని స్పష్టం చేశారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచానికి దిశా నిర్దేశం చేశారని అల్లా సూచించిన దారిలో నడిస్తే ప్రతి ఒక్కరి జీవితం ధన్యం అవుతుందన్నారు తద్వారా స్వర్గలోక ప్రాప్తి జరుగుతుందని అన్నారు. ఖురాన్ మరియు హదీస్ ల నుంచి ప్రధాన సూక్తులను వివరిస్తూ వాటి ప్రాధాన్యత మనం ఆచరించాల్సిన విధానాలను వక్తలు వివరించారు. అనంతరం ఉత్తర్ ప్రదేశ్ లోని బరేలి కి చెందిన ఖతీబ్ ముఫ్తీ గుల్జార్ అహ్మద్ మిస్బాహి ఆధ్వర్యంలో ప్రవక్త కేశాలకు గుసుల్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఎంతో పవిత్రంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని తాలూకా మస్జిద్ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రవక్త జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ బాధ్యులు, జిల్లాలోని పట్టణ ప్రముఖులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శోభ యాత్ర మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ కేంద్రంలోని జామా మస్జీద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు శోభ యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ప్రవక్త జన్మదిన సందర్భంగా భక్తి ప్రవచనాల మధ్య శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పెద్దలు జెండాలు చేత పెట్టి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలను చదువుతూ ర్యాలీ సాగింది. అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్ జెండా ఆవిష్కరించి అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ప్రవక్త జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా వ్యాప్తంగా శోభాయాత్ర ఎంతో గాను ఆకట్టుకుంది

# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ నేతల చేరికలు

మొదటిపేజీ తరువాయి

గూడూరు మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొల్ల బాల చంద్రయ్య, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ సంధ్యమాసన్న దంపతులు, బీఆర్ఎస్ గూడూరు గ్రామ మాజీ అధ్యక్షుడు హెచ్.కుర్మన్న, బీఆర్ఎస్ నాయకులు గొల్ల శివ, జి.మాసన్న, బీజేపీ నాయకులు డి.తరుణ్, డి.బాలకృష్ణ, ఎరుకలి మాసన్న, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ సచ్చిదానందంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ కాంగ్రెస్ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామమన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బంగ్లా రవి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, కార్పొరేటర్ ఎం.పీ. ప్రవీణ్ కుమార్, ఎన్‌పీ నేహాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కంచుపాడులో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభ

మొదటిపేజీ తరువాయి

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 26:**

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామములోసురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ లు పిలుపునిచ్చారు.కంచుపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభకు ఎంపీ మల్లు రవి ముఖ్య అతిథిగా,డా.సంపత్ కుమార్ విశిష్ఠ అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రామంలో యువత కోసం ఏర్పాటు చేసిన సురవరం క్రీడా ప్రాంగణం,లైబ్రరీ,వసతి గృహాలను ప్రారంభించారు.డా.సంపత్ కుమార్ మాట్లాడుతూ,“ఈ తరం మాత్రమే కాదు,రాబోయే తరాల్లో కూడా సురవరం సుధాకర్ రెడ్డి వంటి నాయకుడు ఈ ప్రాంతం నుంచి ఉండబోరు”అని అన్నారు.సుధాకర్ రెడ్డి ఆలోచనా విధానానికి తాను ఎంతో దగ్గరగా ఉండేవాడినని,ఆయనతో కలిసి ఈ ప్రాంతానికి లిఫ్టులు,బీడీ కార్మికుల గోదాం తదితర అభివృద్ధి అంశాలపై ఆలోచనలు చేసినట్లు తెలిపారు.సుధాకర్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆలోచనలు,ఆశయాలు ప్రజల మధ్య చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.24 గంటల్లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారంసురవరం సుధాకర్ రెడ్డి తన చివరి క్షణాల్లో కూడా స్వగ్రామ అభివృద్ధిపైనే దృష్టి పెట్టారని సంపత్ కుమార్ గుర్తుచేశారు.గ్రామానికి బీటీ రోడ్డు,ఇందిరమ్మ ఇళ్లు వంటి అభివృద్ధి పనులు చేయాలని తనతో స్వయంగా ఫోన్‌లో కోరినట్లు తెలిపారు.సుధాకర్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి కూడా రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి గ్రామ అభివృద్ధి కోసం కోరారని చెప్పారు.సుధాకర్ రెడ్డి స్థాయికి ఇంత చిన్న కోరికలు ఉండకూడదని,ఆయన పేరును చిరస్థాయిగా నిలిచేలా చర్యలుతీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం తాను అధికారులతో,జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి లేఖ అందించిన 24 గంటల్లోనే కంచుపాడు గ్రామానికి రూ.3 కోట్లతో బీటీ రోడ్డు,రూ.కోటితో అత్యాధునిక పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేయించినట్లు సంపత్ కుమార్ తెలిపారు.సుధాకర్ రెడ్డి నాకు గురువు లాంటి వారు సురవరం సుధాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు అత్యంత సన్నిహితుడని,తనకు ఆయన గురువులాంటి వారని సంపత్ కుమార్ అన్నారు.సుధాకర్ రెడ్డి ఆలోచనా విధానం,ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత తనను రాజకీయాల వైపు మరింతగా అడుగులు వేయించేలా చేసిందని పేర్కొన్నారు.విజయలక్ష్మి కోరిన మేరకు కంచుపాడులో అంగన్‌వాడీ భవనం,మహిళా సంఘ భవనం సీసీ రోడ్ల నిర్మాణానికి కూడాచర్యలుతీసుకుంటామని సంపత్ కుమార్ హామీఇచ్చారు.గతంలో కోరిన ఐదు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు,సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం మరో 5 నుంచి 10 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి కృషి చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గొర్రెలు,మేకల కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య,కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు,చాడ వెంకటరెడ్డి,అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ కుమార్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల్,ఉండవెల్లి మండల అధ్యక్షుడు వెంకటేశు,మాజీ అధ్యక్షుడు గోపాల్,ఉండవెల్లి సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగరాజు,కంచుపాడు గ్రామ నాయకులు రమాచారి,జోగుల రవి,రాముడు,నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెట్టెంపాడు మిగిలిన పనులు పూర్తి చేస్తాం

మొదటిపేజీ తరువాయి

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 26:**

నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా ఎర్రవల్లి,ఇటిక్యాల మండలాలకు చెందిన దాదాపు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మిగిలిన పనులను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ అన్నారు.99,100,101 ప్యాకేజీలను పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి,డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ ఉండవల్లి మండలానికి వెళుతున్న సందర్భంలో ఎర్రవల్లి మండల చౌరస్తాలో గొర్రెలు, షీప్స్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.శాలువాలు,బొకేలు,పూలమాలలతో సత్కరించారు.అనంతరం నెట్టెంపాడు రిజర్వాయర్ సాధన సమితి సభ్యులు ఎంపీ మల్లు రవిని కలిసి ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ,నెట్టెంపాడు ప్రాజెక్టు పనుల్లో దాదాపు 90 శాతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని,మిగిలిన పనులను కూడా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా

# డెంగ్యూ అనుమానిత బాలిక మృతి.. గాంధీనగర్‌లో ఆరోగ్య శాఖ అప్రమత్తం

## - డెంగ్యూ కట్టడికి రంగంలోకి ఆరోగ్య బృందాలు

## - 18, 19, 20 వార్డుల్లో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు





**వనపర్తి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):**

డెంగ్యూ అనుమానిత లక్షణాలతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎనిమిదేళ్ల బాలిక మృతి చెందిన నేపథ్యంలో వనపర్తి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వనపర్తి గాంధీనగర్‌కు చెందిన ఆంజనేయులు కుమార్తె వెన్నెల ఈ నెల 24న మృతి చెందడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ బుధవారం గాంధీనగర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు 18, 19, 20 వార్డుల్లో ఆరోగ్య శాఖ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్లలో పైరిత్రం స్ప్రే చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటి వనరుల్లో దోమల లార్వాలను గుర్తించి నిర్మూలించారు. డెంగ్యూ అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలను సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్, వనపర్తికి పరీక్షల కోసం పంపించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఫీవర్ సర్వే కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వంశీకృష్ణ, స్థానిక వైద్యాధికారి నదియా, పీర్లగుట్ట వైద్యాధికారి డాక్టర్ క్లైవిన్, గాంధీనగర్ ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్ర గౌడ్, సబ్‌యూనిట్ అధికారి ఓం ప్రకాశ్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహారావు, జిల్లా యాంటీ లార్వా బృందం సభ్యులు గంధం రాజు, గోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్, స్థానిక వైద్య సిబ్బంది రాము, ఆరోగ్య సహాయకులు సుమిత్ర, సుగుణ, ఏఎన్ఎంలు, పీపీ యూనిట్ సిబ్బంది, గాంధీనగర్ ఆశా కార్యకర్తలు, బ్రీడింగ్ చెక్కర్లు పాల్గొన్నారు.

# పెద్ద చింతరేవుల ఆలయంలో 27,28 తేదీల్లో ప్రత్యేక యాగపూజలు

## - శ్రావణ పౌర్ణమి సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు,రక్షాబంధన్

**గద్వాల ఆగస్టు 26(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని జూరాల డ్యాం సమీపంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 27,28 తేదీల్లో ప్రత్యేక యాగాలు,హోమాలు,పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.ఈ నెల 27న ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాదిశ శ్రీపాదుల వారి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతి యాగం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.ఉదయం 9 గంటల నుంచి ఉడిపి వేద పండితులచే శాస్త్రోక్తంగా యాగపూజలు జరుగుతాయని తెలిపారు.ఈ నెల 28న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ శ్రీపాదుల వారు,శ్రీ 1008 విద్యారాజేశ్వర శ్రీపాదుల వారి సన్నిధిలో వరమహాలక్ష్మీ (వరలక్ష్మీ) వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే యజుర్వేద ఉపకర్మ,హయగ్రీవస్వామి జయంతి ఉత్సవం, యజ్ఞోపవీత ధారణ,రక్షాబంధన్,శ్రావణ పౌర్ణమి ప్రవితోపావనం,పీఠాధిపతుల ఆశీర్వచనం,పీఠాధిపతులకు పాదపూజ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతిరోజూ నిర్వహించే నవగ్రహ హోమాలు,పవన హోమాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వసతి కల్పించనున్నట్లు చెప్పారు.ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు స్వయంగా పాల్గొనాలనుకునే వారు 9959251123,9949789241, 9440807109,9440770020 నంబర్లలో సంప్రదించవచ్చని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు.పీఠాధిపతుల ఆశీర్వచనం పొందాలని ఆయన కోరారు.

# కెనాల్ కు నీటి విడుదల రంగవరం రైతుల్లో ఆనందం

**విపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల పరిధిలోని రంగవరం గ్రామ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని శ్రీరంగాపూర్ రిజర్వాయర్ నుంచి నాగసంపల్లి మీదగా రంగవరం గ్రామానికి వెళ్లే కెనాల్ కు బుధవారం నీటిని విడుదల చేశారు రంగవరం గ్రామ సర్పంచ్ శివకుమార్ కెనాల్ గేట్ ను ప్రారంభించి నీటిని విడుదల చేశారు. కెనాల్ కు నీరు చేరడంతో రంగవరం పరిసర ప్రాంతాల్లో రైతుల్లో ఆనందం వ్యక్తం అయింది సాగు పనులకు నీటి లభ్యత మెరుగుపడడంతో పంటలకు ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు గ్రామంలో సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ శివకుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోరెల్లి కురుమయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వీరందర్ రెడ్డి నల్ల పోతుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 26:**

సుధాకర్ రెడ్డి,లాలు భాషా ఆహ్వాన మేరకు బుధవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని నూతన పెట్రోల్ బంక్ ను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామరెడ్డి ప్రారంభించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.







# గిరిజన అభివృద్ధికి పెద్దపీట

## - ప్రతి తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి శ్రీకారం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):**

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితోపాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్‌యార్డులో బుధవారం జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన యువతులు తీజ్ మొలకలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తీజ్ పండుగ బంజారా సమాజానికి పవిత్రమైనదని అన్నారు. మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలను పెంచి పూజించడం, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకోవడం బంజారా సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని తెలిపారు. తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.



### ప్రతి తండాలో సేవాలాల్ ఆలయం

గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజన సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సేవాలాల్ మహారాజ్ స్మృతివనం ఏర్పాటుకు రూ. 200 కోట్లతో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం గిరిజన సమాజంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.



### విగ్రహ ఏర్పాటుకు హామీ

వనపర్తి పట్టణంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బంజారా సేవా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనుల విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధితోపాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి అంటే ఆర్థిక ప్రగతితోపాటు సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమేనన్నారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు, గిరిజన పెద్దలు, మహిళలు, యువతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు పండ్ల పంపిణీ

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)**

మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని మాసుమల్లి దర్గా వద్ద కౌన్సిలర్ రాము ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండ్లను అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డి.ఎస్.పి మహేష్, సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ముస్లిం సోదరులకు పండ్లు పంపిణీ చేసి మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపారు.





## ఘనంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మిథున్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మిథున్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాష్ , మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏపీ మిథున్ రెడ్డి ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, ప్రజల మన్ననలు పొందాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. "హ్యాపీ బర్త్‌డే ఏపీ మిథున్ రెడ్డి " అంటూ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి .

## - ఇంటింటి ప్రచారం - వీధి వీధి పర్యటనలు.- సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ముందు మహాధర్నా విజయవంతం చేద్దాం

## - అఖిలపక్ష నేతల పిలుపు






**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 26( ప్రజా జ్యోతి)**

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సొసైటీలలో జరుగుతున్న అక్రమ లావాదేవీలను అరికట్టాలని , ఇంతవరకు జరిగిన 51 కోట్ల అక్రమ లావాదేవులపై వెంటనే విచారణ చేపట్టాలని కోరుతు సెప్టెంబర్ 9న నారాయణపేట జిల్లా కలెక్టర్ ముందు మహాధర్నా జయప్రదం చేయాలని కోరుతూ అఖిల పక్షం నేతలు కార్మిక సంఘాల నేతలు బుధవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రం 16 వార్డు మడి ఏరియాలో చేనేత కార్మికుల ఇంటి ఇంటి ప్రచారం చేశారు.అర్హులైన చేనేత కార్మికులకు సొసైటీలలో సభ్యత్వం కల్పించాలి.సభ్యత్వం కోసం ధరఖాస్తు పెట్టుకున్నప్పటికి ఇవ్వడం లేదని కార్మికులు తమ దృష్టికి తీసుకొని వచ్చారని తెలిపారు.నేతన్న చేయూత బీమా 5 లక్షల రూపాయలు మరణించిన కార్మికుడి కుటుంబానికి పూర్తిస్థాయిలో అందడం లేదని , కొంతమందికి అర్హత ఉన్నప్పటికిని వారికి అందివ్వడంలో సొసైటీ పెద్దలు విఫలమయ్యారని విమర్శించారు.సొసైటీ అధ్యక్షులు కార్యదర్శిలు జౌళి శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ముడి సరుకుల ధరలు పెరగడం, నేసిన చీరల గిట్టుబాటు ధర రాకపోవడం పవర్ లూమ్స్ యంత్రాలు రావడం తదితర కారణాలతో చేనేత వృత్తి కొనసాగించలేని పరిస్థితి మారిందని ఆందోళన వ్యక్తం చేశారు .నేతన్న అప్పులపాలవుతూ వలస బాట పడుతున్నారని ,ఆకలితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు నోచుకుంటూ ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు .నేతన్న పొదుపు పథకంలో జియో ట్యాగింగ్లో సొసైటీ పెద్దలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కెంచి నారాయణ ,ఎస్ సి ఉపకులాల రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గడ్డం కృష్ణయ్య,జిల్లా అద్యక్షులు సల్ల వెంకటేష్, బి ఎస్ పి నారాయణపేట నియోజకవర్గం అధ్యక్షులు దాసరి అశోక్ , మదర్ తెరిసా సొసైటీ అధ్యక్షులు యూసుఫ్ తాజ్ ,చేనేత కార్మిక సంఘం నాయకులు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుల్జారామ్, సిపిఎం పట్టణ నాయకులు నరహరి ,చేనేత కార్మిక సంఘం పట్టణ నాయకులు యాబన్న చౌదరి,వద్ది నారాయణ తగడఘర్ ప్రకాష్ రావు ,తగడఘర్ పుండలిక్ రావు , శ్రీకాంత్,చిన్న జట్రం సిరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

## - శాంతి, సౌభ్రాతృత్వంతో పండుగలు జరుపుకోవాలి: ఎస్పీ





**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 26( ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం మిలాద్-ఉన్-నబి పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీ ఘనంగా, శాంతియుత వాతావరణంలో జరిగింది. ర్యాలీ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ స్రూూ మెయిన్ చౌక్ వద్ద పాల్గొని ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... మిలాద్-ఉన్-నబి పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ, ఐక్యత, స్నేహభావంతో జీవించాలని సూచించారు.నారాయణపేట జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, హిందూ, ముస్లిం సోదరులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ అన్ని పండుగలను పరస్పర సహకారంతో, సోదరభావంతో నిర్వహించుకోవడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.మిలాద్-ఉన్-నబి ర్యాలీ సందర్భంగా జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ర్యాలీ సజావుగా జరిగేలా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్య కూడళ్లు, ర్యాలీ మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీణ. రియాజ్ ఉల్ హక్, డీసీఆర్బీ డీఎస్పీ మహేష్, సీఐలు శివశంకర్, రవి బాబు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, శిరీష, కృష్ణ చైతన్య, పోలీసు సిబ్బంది, హిందూ, ముస్లిం మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై 27న గ్రామ సభలు

## -ఓటర్లు వివరాలు సరిచూసుకోవాలి:

## చిన్నంబావి మండల తహసీల్దార్ శ్రీనివాస్

**చిన్నంబావి, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)**

ఎస్ఐఆర్2026లో భాగంగా చిన్నంబావి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 27న గురువారం ఉదయం 10 గంటల నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె. శ్రీనివాస్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో సభలు నిర్వహించాలని ఆదేశించారు.గ్రామసభల్లో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన ఓటర్లు, మ్యాపింగ్ కాని ఓటర్లు, తార్కిక వ్యత్యాసాలు, అసమానతల జాబితాలను ప్రజలకు చదివి వినిపించి అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే సందేహాలు, అభ్యంతరాలు, సూచనలను నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ వివరాలను ప్రతి గ్రామ పంచాయతీ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు.ఎస్ఐఆర్2026 ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. వివరాల్లో తప్పులు ఉంటే సవరణలు చేయించుకోవడంతోపాటు అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



# ఏజెన్సీల కేటాయింపులో అవకతవకలు..

## - జిల్లా ఉపాధి కల్పన అధికారిని సస్పెండ్ చేయాలి : పోలే నరేందర్ మాదిగ




**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఏజెన్సీల ఎంప్యానల్, రిక్రూట్‌మెంట్, శాఖల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జిల్లా ఉపాధి కల్పన అధికారిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని పీయూ జేఏసీ చైర్మన్, తెలంగాణ స్టూడెంట్ రెవల్యూషన్ జాక్ వ్యవస్థాపకులు పోలే నరేందర్ మాదిగ డిమాండ్ చేశారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లాకు 29 ఏజెన్సీలు ఎంప్యానల్ కాగా, వాటిలో 19 ఏజెన్సీల సేవలను మాత్రమే వినియోగించుకున్నారని, మరో 10 ఏజెన్సీలు రిజర్వ్‌లో ఉన్నప్పటికీ వాటి సేవలను వినియోగించుకోకుండా కొత్తగా ఏజెన్సీల రిక్రూట్‌మెంట్ చేపట్టడంపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఏ జీవో ప్రకారం కొత్తగా ఏజెన్సీల రిక్రూట్‌మెంట్ చేపట్టారో స్థానికులకు అధికారులు వివరించాలని నరేందర్ మాదిగ డిమాండ్ చేశారు. టెండర్ ఫామ్‌లను లాటరీ విధానం ద్వారా ఎంపిక చేస్తామని, ఈఎండీగా రూ.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉండాలనే నిబంధనలను ముందుగా స్పష్టంగా ప్రకటించలేదని ఆయన ఆరోపించారు. గతంలో ఏజెన్సీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు ఫీజు రూ.2,000 ఉండగా ప్రస్తుతం రూ.5,000కు పెంచడంపై కూడా వివరణ ఇవ్వాలని అన్నారు.2006 డిసెంబర్ 27న అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆధారంగానే ప్రక్రియ చేపట్టామని అధికారులు చెబుతున్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా కొత్త రాష్ట్రానికి అనుగుణంగా స్పష్టమైన నిబంధనలు ఎందుకు రూపొందించలేదని ఆయన ప్రశ్నించారు. తాము ప్రస్తావిస్తున్న జీవోలో ఈఎండీ ఫిక్స్‌డ్ డిపాజిట్ నిబంధన లేదని పేర్కొన్నారు.లక్కీ డ్రా విధానంలో ఏజెన్సీ పేరు, కేటాయించాల్సిన శాఖ పేరును ఒకేసారి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ విధానం పాటించకుండా తమకు అనుకూలమైన ఏజెన్సీలకు ఇష్టమైన శాఖలను కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయని నరేందర్ మాదిగ అన్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారుల నుంచి స్పష్టమైన వివరణ రావాల్సి ఉందని పేర్కొన్నారు.స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, స్థానిక ఏజెన్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక ఏజెన్సీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నరేందర్ మాదిగ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు రమేష్, బహుజన సంఘాల నాయకులు శేఖర్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఈద్ మిలాద్-ఉన్-నబీ మతసామరస్యానికి ప్రతీక

## - ప్రేమ, శాంతి, సోదరభావంతో ముందుకు సాగాలి : ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 26( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మిలాద్- ఉన్-నబీ పర్వదినం మతసామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని గడియారం చౌరస్తా వద్ద ఖౌమి ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి నిర్వహించిన ఊరేగింపును ఆయన ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఊరేగింపుకు ఘన స్వాగతం పలికి ముస్లిం సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమ, శాంతి, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ ఈద్ మిలాద్-ఉన్-నబీ ఐక్యత, సోదరభావానికి సంకేతమని అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, నగర మేయర్ గుమ్మాల మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు, మత పెద్దలు, ముస్లిం మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, ఖౌమి ఏక్తా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



---

# మీలాద్ ఉన్ నభి ర్యాలీకి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## - అర్ధరాత్రి అనంతరం ర్యాలీ మార్గాలు, మసీదుల వద్ద బందోబస్తును పరిశీలించిన ఎస్పీ జానకి






**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మీలాద్ ఉన్ నభి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం అర్ధరాత్రి అనంతరం పట్టణంలోని ర్యాలీ మార్గాలు, ప్రారంభముగింపు ప్రాంతాలు, ముఖ్యమైన మసీదుల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించిన ఎస్పీ.. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో ముందుగానే చేరుకుని విధులు నిర్వహించాలని సూచించారు.ర్యాలీ మార్గంలో ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మసీదుల వద్ద భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. ర్యాలీ నిర్వాహకులు పోలీసు శాఖకు ముందుగా తెలియజేసిన మార్గంలోనే, అనుమతించిన సమయంలో మరియు నిబంధనలకు అనుగుణంగా ర్యాలీ నిర్వహించాలని స్పష్టం చేశారు. అత్యవసర సేవల వాహనాలకు అంతరాయం కలగకుండా పోలీసులకు నిర్వాహకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాలని, రెచ్చగొట్టే నినాదాలు, వివాదాస్పద వ్యాఖ్యలు లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పోలీసు సిబ్బంది ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మీలాద్ ఉన్ నభి ర్యాలీ సోదరభావం, మత సామరస్యానికి ప్రతీకగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని ఎస్పీ డి.జానకి పేర్కొన్నారు. ప్రజలు, ర్యాలీ నిర్వాహకులు, పోలీసు శాఖ సమన్వయంతో సహకరిస్తే కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఈ పరిశీలనలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా 392 యూనిట్ల రక్తదానం

## - రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ జానకి..

## - రక్తదాతలకు సర్టిఫికెట్ల అందజేత






**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో):**

మిలాద్ - ఉన్-నబీ సందర్భంగా మహబూబ్‌నగర్ టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 392 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా సేకరించారు. పట్టణంలోని ఆల్మాస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం అత్యంత విలువైన సామాజిక సేవ అని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, ముఖ్యంగా యువతలో రక్తదానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మనం ఇచ్చే రక్తం అత్యవసర సమయంలో అవసరమైన వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. మిలాద్-ఉన్-నబీ వంటి పవిత్ర సందర్భాన్ని సేవా కార్యక్రమంతో అనుసంధానించి భారీ స్థాయిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి రక్తం అందేలా కృషి చేస్తున్న టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను ఆమె అభినందించారు. శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవకు గుర్తింపుగా సర్టిఫికెట్లను అందజేశారు. సేవా కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న దాతలను అభినందిస్తూ, సమాజంలో మరింత మంది రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ బశ్వర్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇజాజ్, సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్లా, ముఖ్య సభ్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

**నాగర్ కర్నూల్ :ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)**

మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నాగర్ కర్నూల్ మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో "మీలాద్ ఉన్ నబీ" పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా మంగళ వారం రాత్రి మండల పరిధిలో వివిధ గ్రామాలలోని మస్జీద్ లలో మీలాద్ ఉన్ నబీ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ముఫ్తీలు మహమ్మద్ ప్రవక్త అనుసరించిన విధానాలను కండ్లకు కట్టిన ట్లు వివరిస్తూ మహమ్మద్ ప్రవక్త ఈ మానవాళికి భూమికి ఆకాశానికి క్రాంతి లాంటి వారని ఆయన చూపిన మార్గమే సన్మార్గమని ఆయన చూపిన మార్గంలో నడవాలని,అల్లా సూచించిన దారిలో నడిస్తే జీవితం ధన్యమవుతుందని,తద్వారా స్వర్గలోక ప్రాప్తి జరుగుతుందని అన్నారు.కార్యక్రమాల అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.






# భక్తిశ్రద్ధలతో ఘనంగా మీలాద్ ఉన్ నబీ

## - మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్న ముస్లింలు

## -ప్రవక్త జన్మదినం సందర్భంగా శోభ యాత్ర

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 26 (ప్రజా జ్యోతి)**





మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మీలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం లు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకు న్నారు.ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నాగర్ కర్నూల్ జిల్లాకేంద్రంలోని జామ మస్జిద్ లో మీలా ద్ ఉన్ నబీ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నా రు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జామియా నిజామియా అరబి యూనివర్సిటీ కి చెందిన మౌలానా ముఫ్తీ మొహమ్మద్ ఇర్ఫాన్ ఖా న్ ఖాద్రి మరియు ఉత్తర్ ప్రదేశ్ బరేలి కి చెందిన ఖతీబ్ ముఫ్తీ గుల్జార్ అహ్మద్ మిస్బాహి మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మహమ్మద్ ప్రవక్త అనుసరించిన విధానాలను కండ్లకు కట్టినట్లు వివరించారు.మహమ్మద్ ప్రవక్త మానవాళికి భూమికి ఆకాశానికి ఓ క్రాంతి లాంటి వారని ప్రవక్త చూపిన మార్గమే సన్మార్గమని భూమి, ఆకాశం ఈ సృష్టికే సృష్టికర్త అయిన అల్లాహ్ ముందుగా మహమ్మద్ ప్రవక్త పుట్టకముందే ఒక సందేశాన్ని ఇచ్చే విధంగా ఏడు లోకాల నుంచి భూమి వరకు ఒక క్రాంతిని సృష్టించారని,ఈ భూమి మీద ఉన్న చెట్టు,పుట్ట, నీరు,జీవజాలం సర్వస్వం ప్రవక్త కోసమే అల్లాహ్ సృష్టించారని అన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచానికి దిశా నిర్దేశం చేశారని అల్లా సూచించిన దారిలో నడిస్తే ప్రతి ఒక్కరి జీవితం ధన్యమవుతుందని తద్వారా స్వర్గలోక ప్రాప్తి జరు

గుతుందని అన్నారు.ఖురాన్ మరియు హదీస్ ల నుంచి ప్రధాన సూక్తులను వివరిస్తూ వాటి ప్రాధాన్యత మనం ఆచరించాల్సిన విధానాలను వక్తలు వివరించారు.మస్జిద్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్ అధ్యక్షతన జరిగిన మీలాద్ -ఉన్- నబీ ఉత్సవాలలో మీలాత్ కమిటీ అధ్యక్షుడు షేక్ యాకూబ్ బావజీర్,మహమ్మద్ సాదిక్ పాషా,మహమ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో సలాం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఉత్తర్ ప్రదేశ్ బరేలి కి చెందిన ఖతీబ్ ముఫ్తీ గుల్జార్ అహ్మద్ మిస్బాహి ఆధ్వర్యంలో ప్రవక్త కేశాలకు గుసుల్



కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పవిత్రంగా నిర్వహించారు.బుధవారం ఉదయం మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ బాధ్యులు,ఫిక్రే రజా ఫౌండేషన్ స భ్యులు,పట్టణ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.

### ప్రవక్త జన్మదినం సందర్భంగా శోభ యాత్ర:-

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని జామా మస్జీద్ నుండి మధ్యాహ్నం రెండు గంటలకు శోభ యాత్ర నిర్వహించి పట్టణంలోని ప్రధాన రహదారుల భక్తి ప్రవచనాల మధ్య శోభయాత్రను ఘనంగా నిర్వహించారు.చిన్నారులు పెద్దలు జెండాలు చేత పట్టి ప్రవక్త "సల్లల్లాహు అలైహి వసల్లం" ప్రవచనాలను చదువుతూ ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్ పైన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.




# పాముకాటుతో ప్రాణాపాయం నుంచి పునర్జన్మ

## - వెంటిలేటర్ పై చికిత్స అందించి వంగూర్ వాసిని కాపాడిన యశోద వైద్యులు

**కల్వకుర్తి,ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):**

పాముకాటుతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓ వ్యక్తికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సకాలంలో అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వంగూరు ప్రాంతానికి చెందిన శేఖర్ పాము కాటుకు గురై నాడీ వ్యవస్థ, శ్వాసకోశం, గుండె పనితీరు తీవ్రంగా దెబ్బతినడంతో విషమ పరిస్థితిలో ఆసుపత్రికి చేరుకున్నారు. ఛాతీనొప్పి, స్పృహ కోల్పోవడంతో శేఖర్‌ను యశోదా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో న్యూరోటాక్సిక్ స్నేక్ ఎన్వెనమేషన్, అక్యూట్ ఎన్సెఫలోపతి, తీవ్రమైన శ్వాస వైఫల్యం, గుండె ఎడమ జఠరిక పనితీరు గణనీయంగా తగ్గడం వంటి సమస్యలను వైద్యులు గుర్తించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వైద్యులు వెంటనే రోగిని వెంటిలేటర్‌పై ఉంచి, యాంటీ స్నేక్ వెనమ్ అందించారు. క్రిటికల్ కేర్ విభాగంలో నిరంతర మానిటరింగ్‌తో చికిత్స కొనసాగించారు. చికిత్సకు రోగి క్రమంగా స్పందించడంతో నాడీ వ్యవస్థ, స్పృహలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. శ్వాసకోశ పనితీరు మెరుగుపడటంతో కొంతకాలం తర్వాత వెంటిలేటర్ నుంచి రోగిని విజయవంతంగా బయటకు తీసుకువచ్చారు. గుండె పనితీరు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలను సైతం వైద్యులు సమర్థవంతంగా నియంత్రించడంతో శేఖర్ ఆరోగ్యం క్రమంగా స్థిరపడింది. ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకుని, స్థిరమైన ఆరోగ్యంతో ఇంటికి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు డా. రంగా సంతోష్ కుమార్, డా. కళాధర్, డా. శబరీనాథ్ సముద్రాల మాట్లాడుతూ.. న్యూరోటాక్సిక్ పాము విషం నాడులు, కండరాల పనితీరును తీవ్రంగా దెబ్బతీసి ప్రాణాపాయ పరిస్థితికి దారితీయవచ్చని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో సకాలంలో యాంటీ స్నేక్ వెనమ్ ఇవ్వడం, శ్వాసకోశానికి అవసరమైన సహాయక చికిత్స అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిటూరి మాట్లాడుతూ.. వివిధ వైద్య విభాగాల సమన్వయం, అత్యాధునిక ఐసీయూ సదుపాయాలు, మెకానికల్ వెంటిలేషన్, నిరంతర మానిటరింగ్ ద్వారా విషమ పరిస్థితుల్లో ఉన్న రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సకాలంలో సరైన వైద్యం అందితే పాముకాటు బాధితుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, పాము కాటుకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని అత్యవసర వైద్య సదుపాయం ఉన్న ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వినయ్ కుమార్, అవినాష్ ఉన్నారు.

# ఉత్కంఠకు తెర.. ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడి ఎన్నిక

## - ఎట్టకేలకు సద్దుమణిగిన ఉత్కంఠ..చిన్నంబావి మండల అధ్యక్షుడిగా కే. గోపాల్ మాదిగ

**చిన్నంబావి, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)**







చిన్నంబావి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడి ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. మండల అధ్యక్షుడిగా కేతపాగ గోపాల్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి దేవని రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ, జిల్లా మాజీ అధ్యక్షులు కొమ్ము కేశవులు మాదిగ, గంధం గట్టయ్య మాదిగ, మీసాల నాగరాజు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నంబావి మండల అధ్యక్షుడిగా కేతపాగ గోపాల్ మాదిగ, అధికార ప్రతినిధిగా సహదేవుడు మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా శివకృష్ణ మాదిగ, నరసింహ మాదిగ, ఉపాధ్యక్షులుగా చారకొండ బాబు మాదిగ, శ్యామ్ ప్రసాద్ మాదిగ, కార్యదర్శులుగా బాల వెంకట్ మాదిగ, కోటేశ్వర్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎమ్మెస్ఎఫ్ మండల కమిటీని సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తగరం బాలాకిష్టయ్య, అధికార ప్రతినిధిగా బోరెల్లి జయరాం మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా దేవయ్య మాదిగ, హిట్లర్ నరసింహ మాదిగ. ఉపాధ్యక్షుడిగా సురిగిరి శ్రీనివాసులు మాదిగ, కార్యదర్శిగా తగరం చిన్న కురుమయ్య మాదిగ ఎన్నికయ్యారు. ఉద్యమాలను ఉధృతం చేయాలి. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ మాట్లాడుతూ కుల వివక్ష, మత దురహంకారం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సమసమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలు, ఉద్యమ వారసత్వాన్ని నూతన తరానికి అందించాల్సిన బాధ్యత మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. నూతన తరాన్ని పెద్ద సంఖ్యలో ఉద్యమంలోకి తీసుకువచ్చి బలమైన ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దాలని సూచించారు. పదవులు బాధ్యతగా భావించి ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. మండలంలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తగరం కురుమయ్య మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ మాదిగ, ఎస్. శ్రీనివాసులు మాదిగ, సంపంగి మద్దిలేటి మాదిగ, కాన్షిరాం మాదిగ, వెంకటేష్ మాదిగ, కత్తి కురుమూర్తి మాదిగ, చిన్నమారు సర్పంచ్ మద్దూరి శంకర్ మాదిగ, కల్లు శ్రీనివాసులు మాదిగ, సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న మాదిగ, ఎం ఎల్లయ్య మాదిగ, ఎం మహేష్, శివ, కాశన్న, బాలకృష్ణ, మధు, నవీన్, కే ఎల్లయ్య, వడ్డేమాన్ విష్ణు వర్మ,డీఎన్ కృష్ణతో పాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ జనరల్ సెక్రటరీగా డాక్టర్ పవన్ కుమార్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో):**

కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా డాక్టర్ సెల్ జనరల్ సెక్రటరీగా డాక్టర్ పవన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆయనకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో, సేవా కార్యక్రమాల్లో డాక్టర్ సెల్ చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి డాక్టర్ పవన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, వైద్య రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత, డాక్టర్ జె. రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి 97వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి

## - మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి 97వ జయంతి

**కృష్ణా ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)**

కృష్ణ మండలం గుడేబల్లూరు గ్రామపంచాయతీ టీ-రోడ్డు వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై చిట్టెం నర్సిరెడ్డి గారి విగ్రహానికి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా చిట్టెం రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ చిట్టెం నర్సిరెడ్డి తన జీవితాంతం పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలు

## - కల్వకుర్తిలో పండుగలు మతసామరస్యానికి నిదర్శనం

## - మిలాద్ ఉన్ నబీ వేళ రక్తదానంతో మానవత్వం చాటిన ముస్లీం సోదరులు





**కల్వకుర్తి ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):**

కల్వకుర్తి పట్టణంలో మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలను ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు.మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన మస్జీద్ లలో ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం బుధవారం అల్విజాన్ మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్,కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ భృంగి ఆనంద్ కుమార్,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో 45 మంది ఆరోగ్యంగా ఉన్న యువకులు, పెద్దలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సేవా భావంతో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని ఈ కార్యక్రమంలో హిందూ,ముస్లీం సోదరులు కలిసి పాల్గొనడం విశేషమనీ వారు పేర్కొన్నారు.రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు రక్తదాన శిబిరం నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ కౌన్సిలర్ నాజియా మక్బూల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మసూద్, రమాకాంత్ రెడ్డి, నాయకులు సోఫీ, ఇంతియాజ్ ఖాన్, తయ్యుబ్ అలీ,ఆరీఫ్, సాజిద్,దున్న సురేష్, నవీన్ లతో పాటు మస్జీద్ కమిటీ అధ్యక్షులు, ఇమామ్, మౌలానాలు,స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో దళితుల భూమి ఆక్రమణ యత్నం ప్రశ్నించిన వ్యక్తిపై హత్యాయత్నం

## - సర్వే నెం. 743 భూమిని కాపాడాలని మాల జేఏసీ డిమాండ్





**కల్వకుర్తి ఆగస్టు 26(ప్రజా జ్యోతి):**

కల్వకుర్తి పట్టణంలోని సర్వే నెంబర్ 743లో వంశపారంపర్యంగా వస్తున్న దళితుల భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని మాల కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ ఆరోపించారు. భూమిని కాపాడుకునేందుకు ప్రశ్నించిన బాధితుడిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భూమిని సందర్శించిన దళిత సంఘాల నేతలు

బుధవారం మాల, దళిత ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి చెరుకు సుధాకర్, మంత్రి నరసింహ, పాత్కుల శ్రీశైలం తదితరులు సర్వే నెం. 743లోని భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా చెరుకు సుధాకర్ మాట్లాడుతూ, "దళితుల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ఏ మాత్రం సహించేది లేదు. భూమి తమదేనని ప్రశ్నించినందుకు పంబళ్ల సుధాకర్‌పై దాడి చేయడం దారుణం" అని అన్నారు.బాధితుడు పంబళ్ల సుధాకర్ వివరాల ప్రకారం.. వారి కుటుంబానికి సర్వే నెం. 743లో మొత్తం 3 ఎకరాల 38 గుంటల భూమి ఉంది.హైవే నిర్మాణంలో 20 గుంటలు కోల్పోగా, ప్రస్తుతం 3 ఎకరాల 18 గుంటలు మిగిలి ఉంది.కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల శ్రీధర్‌రెడ్డి, జంగయ్య తదితరులు ఈ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు.పనులను అడ్డుకుని ప్రశ్నించడంతో తనపై దుర్భాషలాడి దాడి చేశారని సుధాకర్ ఆరోపించారు. ప్రాణాపాయ స్థితిలో అక్కడి నుంచి తప్పించుకుని 100కు డయల్ చేసినట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎనుముల శ్రీధర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలనిదళితుల భూమి ఆక్రమణ యత్నంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు.కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళితుల భూముల రక్షణకు రెవెన్యూ, పోలీసు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం, ఆనంద్, టీఆర్ఎస్వీ నాయకులు వట్టేపు కిషోర్, ముత్యాల నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు శేఖర్, బాలస్వామి, నరసింహ, నందు, అనిల్ తదితరులు ఉన్నారు.